

నాగోబాను దర్శించుకున్న శిక్షణ డిప్యూటీ కలెక్టర్ల బృందం


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం ı 5 ఏప్రిల్ 2026 ı ■ 09 పేజీలు


## ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలో గందర గోళం

# ఎన్నిక వాయిదా

## నేడు మళ్ళీ ఎన్నికకు ఏర్పాట్లు





**ఖానాపూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా గందరగోళ పరిస్థితుల మధ్య వాయిదా పడింది. మళ్ళీ ఆదివారం ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.ఎన్నిక వాయిదా వేయడం పట్ల బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన కు దిగారు. ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి ఆందోళనకు దిగారు. బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిని చైర్మన్‌గా ఎన్నుకోవడానికి సరిపడా కోరం ఉన్నప్పటికీ ఎన్నికను అధికారులు వాయిదా వేయడంపై ఆగ్రహించిన ఇరుపార్టీల కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు నిరసనకు దిగారు. వారికి మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జాన్సన్ నాయక్ ఆందోళనలో పాల్గొన్నారు. కౌన్సిల్ సభ్యులకు అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చైర్మన్ ఎన్నిక ఎలా వాయిదా వేస్తారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నిరసన కారణంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఖానాపూర్ 8వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బొప్పారావు సత్యవతి కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను తోటి కౌన్సిలర్లు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా పడినప్పటికీ క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నిక సజావుగా జరిగింది . మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్– సీపీఐ కూటమి దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ గుడిసెల సంధ్యారాణి ఎన్నిక కాగా,వైస్ చైర్‌పర్సన్‌గా సీపీఐ అభ్యర్థి సరిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడంతో ఎన్నికకు దూరంగా ఉంది.



## క్యాతన్‌పల్లి 'గులాబీ'మయం

■ కూటమికే మునిసిపల్ పీఠం! ■ ఎట్టకేలకు ముగిసిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక

■ కాంగ్రెస్ సభ్యుల గైర్హాజరు ■ హైకోర్టు ఆదేశాలతో రెండూ నెలల ఉత్కంఠకు తెర..

■ 14 మంది సభ్యుల మద్దతుతో ఏకగ్రీవం ■ చైర్‌పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా మిట్టపల్లి సరిత ప్రమాణ స్వీకారం



క్యాతన్‌పల్లి మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌ల పర్యవేణలో శనివారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో చేపట్టారు. దీంతో దాదాపు రెండునెలలుగా మునిసిపాలిటీలో నెలకొన్న ఉద్రిక్తతకు తెరపడింది. హైకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించగా, కూటమి సభ్యులనే రెండు పదవులు వరించాయి. ఎన్నికకు కాంగ్రెస్ సభ్యులు దూరంగా ఉండగా, బీఆర్ఎస్, సీపీఐ సభ్యులు 14 మంది హాజరయ్యారు. సరిపడా కోరం ఉండటంతో అధికారులు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. 10 సీట్లు సాధించిన బీఆర్ఎస్ సభ్యురాలు గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా సీపీఐకి చెందిన మిట్టపల్లి సరితకు మిగతా సభ్యులు మద్దతు తెలపడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి, నియామక పత్రం అందజేశారు.

## దక్షిణాది కుంభమేళా తరహాలో ఏర్పాట్లు ఉండాలి

- ■ మంత్రి గడ్డం వివేకానంద
- ■ చెన్నూర్ తీరంలో అధికారులతో కలిసి పుష్కర ఘాట్ల పరిశీలన
- ■ రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం రూ. 500 కోట్ల నిధుల కేటాయింపు
- ■ పుష్కర ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు
- ■ ఫిబ్రవరి 2027 నాటికి పనులు పూర్తి కావాలి
- ■ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి
- ■ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ■ ఇండోర్ స్టేడియం, 100 పడకల ఆస్పత్రి పనుల పరిశీలన





## ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక గందరగోళంపై వివరణ ఇచ్చిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

శనివారం జరిగిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో జరిగిన గందరగోళంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వివరణ ఇచ్చారు.తాము ప్రజాస్వామ్య బద్దంగానే నడుచుకున్నామని ఎలాంటి దౌర్జన్యం చేయలేదని అన్నారు పార్టీల పరంగా సభ్యులను వేరువేరు గా కూర్చోబెట్టిన ఎన్నికల అధికారులు అక్షర క్రమంలో అభ్యర్థుల పేర్లు ఎన్నిక కోసం ప్రకటిస్తామని చెప్పకుండానే బిజెపి అభ్యర్థి మౌనిక పేరు ప్రకటించడంతో కౌన్సిలర్లు గందరగోళం లో పడిపోయి చేతులు లేపారని ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి పేరు ప్రకటించడంతో ఏడుగురు సభ్యులు చేతులు లేపారని తెలిపారు.అందుకు సంబంధించిన వీడియో రికార్డులు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు.కానీ బీజేపీ సభ్యులు దౌర్జన్యానికి పాల్పడి గందరగోళం సృష్టించారని అన్నారు బిజెపి, బిఆర్ ఎస్ అనైతికపొత్తు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖునిని చేసే ప్రయత్నం చేశారని అన్నారు.దళితులు ఆదివాసులను అణగదొక్కే ప్రయత్నం జరుగుతుందన్నారు.

## గోదావరి పుష్కరాలకు పక్కా
# కార్యాచరణ సిద్ధం చేయాలి

■ దక్షిణాది కుంభమేళా తరహాలో ఏర్పాట్లు ఉండాలి ■ మంత్రి గడ్డం వివేకానంద
■ చెన్నూర్ తీరంలో అధికారులతో కలిసి పుష్కర ఘాట్ల పరిశీలన
■ రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం రూ. 500 కోట్ల నిధుల కేటాయింపు ■ పుష్కర ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు..
■ ఫిబ్రవరి 2027 నాటికి పనులు పూర్తి కావాలి ■ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి
■ చెన్నూర్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ■ ఇండోర్ స్టేడియం, 100 పడకల ఆసుపత్రి పనుల పరిశీలన
■ మహంకాళి కాలనీ నుండి ఘాట్ వరకు నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు







**చెన్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
గోదావరి పుష్కరాల నిర్వహణకు పూర్తి కార్యచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని గోదావరి నది తీరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, చెన్నూర్ తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, దేవాదాయ, విద్యుత్, రహదారులు భవనాల శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో పుష్కర ఘాట్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు దక్షిణాది కుంభమేళా తరహాలో ఉంటాయని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి నది పరివాహకంలో అనువైన ప్రాంతాలలో పుష్కరాల ఏర్పాట్ల కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, ప్రజా రవాణా వ్యవస్థ, పుష్కర ఘాట్ ప్రాంతాలలో లైటింగ్, త్రాగునీటి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్ ఏర్పాట్లలో భాగంగా చెన్నూర్ పట్టణంలోని మహంకాళి కాలనీ నుండి పుష్కర ఘాట్ వరకు నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుష్కరాలలో భక్తుల సంఖ్య అంచనా ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వెలుతురు, పారిశుద్ధ్యం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తుల సంరక్షణ దిశగా పుష్కర స్నానాల ప్రాంతాలలో ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి నది తీర ప్రాంతాలలో పుష్కరాల కొరకు ప్రభుత్వం 500 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి పుష్కరాలను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో స్మశాన వాటిక ఏర్పాటు కొరకు 1 కోటి రూపాయలు కేటాయించి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ గోదావరి తీరంలో పుష్కర స్నానాలకు రోజుకు 2 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని, పార్కింగ్, వాహనాల నియంత్రణ కొరకు అంతర్గత రహదారుల విస్తరణ, మున్సిపల్ పరిధిలోని రహదారుల విస్తరణ, మూత్రశాలలు, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదుల ఏర్పాటు శాశ్వత ప్రాతిపదికన చేసే విధంగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. పుష్కర ఏర్పాట్లలో భాగంగా ఫిబ్రవరి 2027 నాటికి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో ఆర్.టి.సి. బస్ డిపో ఏర్పాటులో భాగంగా కొనసాగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# టార్చ్‌లైట్ వెలుగులో 'పది' భవితవ్యం!



■ చీకట్లో మూల్యాంకనం..
■ విద్యార్థుల జీవితాలతో విద్యాశాఖ చెలగాటం!
■ సెల్‌ఫోన్ వెలుతురులో పేపర్ల దిద్దుబాటు.
■ ఆదిలాబాద్ స్పాట్ సెంటర్‌లో దారుణం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ఏడాది కాలం పాటు రాత్రింబవళ్లు కష్టపడి విద్యార్థులు రాసిన పదో తరగతి పరీక్ష పత్రాల పరిస్థితి ఇప్పుడు అగమ్య గోచరంగా మారింది. మూల్యాంకన కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో విద్యాశాఖ ఘోరంగా విఫలమైంది. ఆదిలాబాద్ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. స్పాట్ సెంటర్లలోకి సెల్‌ఫోన్లను అనుమతించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, శనివారం ఈ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులోనే పేపర్లను దిద్దడం కలకలం రేపింది. చిమ్మచీకట్లో, సెల్‌ఫోన్ గుడ్డి వెలుతురులో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం వల్ల విద్యార్థుల మార్కులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మార్కు తేడాతో విద్యార్థుల గ్రేడింగ్ మారిపోయే అవకాశం ఉన్న పదో తరగతి పరీక్షల విషయంలో విద్యాశాఖ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ఇన్వర్టర్లు లేదా జనరేటర్ల సౌకర్యం లేని గదుల్లో ఉపాధ్యాయులు ఎలాగోలా పని పూర్తి చేయాలనే ధోరణితో పేపర్లను దిద్దేస్తున్నారు. అస్తవ్యస్త మూల్యాంకనం వల్ల విద్యార్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి మూల్యాంకన కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.




# తపాలా నిధులు గోల్‌మాల్

**బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రిమాండ్!**
**తలమడుగులో పోస్టల్ శాఖలో కుంభకోణం**
**రూ. 2.12 లక్షల దుర్వినియోగం**

**తలమడుగు, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ప్రజలు నమ్మకంతో దాచుకున్న తపాలా నిధులను తన సొంత అవసరాలకు వాడుకున్న ఓ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పాపం పండింది. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ కె. ఫణిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుయ్యాడి గ్రామంలో గ్రామీణ డాక్ సేవక్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా అబ్దుల్ నిజాం పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా వచ్చిన రూ. 2,12,033/- మొత్తాన్ని కార్యాలయ ఖాతాలో జమ చేయకుండా, తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నాడు. ఈ అక్రమం బయటపడటంతో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి రాజు తలమడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేపట్టి నిందితుడు అబ్దుల్ నిజాంను అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఫణిధర్ ఆధ్వర్యంలో నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు ఎస్సై డి. రాధిక మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ నిధులను, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై విచారణ ఇంకా కొనసాగుతోందని వెల్లడించారు.

## విద్యార్థిని వేధింపులకు గురి చేస్తున్నాడు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే స్కూల్ హౌస్ మాస్టర్ తన పిల్లవాడిని టార్గెట్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారని 6వ తరగతి చదువుకుంటున్న మోహిత్ అనే విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. శనివారం ఈ మేరకు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడారు. గతకొంత కాలంగా స్కూల్‌లో తన పిల్లవాడిని హౌస్ మాస్టర్ అకారణంగా వివిధ పేర్లతో కామెంట్స్ చేయడంతో పాటుఇతర విద్యార్థులతో కొట్టిస్తున్నారని వాపోయాడు. ముందే కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడని.. ఈ వేధింపులకు విద్యార్థి ఏమైనా అఘాయిత్యానికి పాల్పడితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. హౌస్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

**విద్యార్థులను వేదిస్తే కఠిన చర్యలు తప్పవు**



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మైనర్ బాలికను లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ పంపించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలంలోని నార్లపూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణ గతకొన్ని రోజులుగా కెరమెరి మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక స్కూల్‌కు వెళ్తుండగా వెంటపడటంతో పాటు ఫోన్ చేసి, లైంగిక వేధింపులకు గురి చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయికృష్ణపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ప్రేమ పేరుతో బాలికల వెంటపడి వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆకతాయిలను ఎస్సై హెచ్చరించారు. అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే, నిర్భయంగా పోలిసులకు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని చెప్పారు.

# సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లపై కలెక్టర్ రాజర్షి షా సమీక్ష - ప్రోటోకాల్ పాటించడంలో ఏమాత్రం అలసత్వం వద్దు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం - 6వ తేదీన జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన
- కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమావేశం - హెలిప్యాడ్, సభా వేదిక వద్ద పకడ్బందీ భద్రతా చర్యలు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రారంభోత్సవాలు, శిలాఫలకాల ఆవిష్కరణ వద్ద ప్రోటోకాల్ పాటించాలని, కేటాయించిన విభాగం వద్దనే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉండాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, ఇతర సర్టిఫికేషన్ అందజేత వంటి కార్యక్రమాలను నిర్ణీత సమయంలోగా, క్రమశిక్షణతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేదిక వద్ద తాగునీరు, సీటింగ్. పార్కింగ్, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్ వద్ద, విఐపి గ్యాలరీలో కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, అనుమతి ఉన్న వారు మాత్రమే అక్కడ ఉండేలా చూడాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డిఆర్డీఓ రవీందర్, వివిధ శాఖల ఈఈలు, తహశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నిజాయితీ చాటుకున్న యువకులు

**దొరికిన నగదు పర్సు అప్పగింత**

**వినాయక చౌక్‌లో దొరికిన పర్సు**

**బాధితుడికి అందజేసిన రాజేందర్, వంశీ**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

నేటి స్వార్థపూరిత సమాజంలో ఇంకా మానవత్వం, నిజాయితీ బతికే ఉన్నాయని ఆదిలాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు నిరూపించారు. రోడ్డుపై దొరికిన నగదు, విలువైన పత్రాలతో కూడిన పర్సును బాధితుడికి అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన కుంట అశోక్ శనివారం సాయంత్రం 7:30 గంటల సమయంలో వినాయక చౌక్ మీదుగా రైతు బజార్‌కు వెళ్తుండగా తన పర్సును పోగొట్టుకున్నారు. అందులో రూ. 2,200 నగదుతో పాటు ఆధార్ కార్డు వంటి విలువైన పత్రాలు ఉన్నాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న అర్లి బి గ్రామానికి చెందిన రాజేందర్, వంశీలకు ఆ పర్సు దొరికింది. పర్సులో ఉన్న పత్రాల ఆధారంగా బాధితుడి వివరాలు తెలుసుకున్న యువకులు, వెంటనే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. హెడ్ కానిస్టేబుల్ నరవాడే విజయ్ సమక్షంలో బాధితుడు అశోక్‌ను పిలిపించి పర్సును భద్రంగా అందజేశారు. యువకుల నిజాయితీని వన్‌టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. పోగొట్టుకున్న పర్సు తిరిగి దొరకడంతో బాధితుడు యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# భోస్రలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

బజార్‌హత్నూర్ మండలం భోస్ర గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ శివ నామ సప్తాహం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.



# డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగంపై పోలీసుల ఉక్కుపాదం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

గృహ అవసరాలకు కేటాయించిన (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు కొరడా ఝుళిపించారు. పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలపై శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన ఆరు వాణిజ్య సంస్థలపై కేసులు నమోదు చేశారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధరకు వచ్చే డొమెస్టిక్ గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఈ దాడులు చేపట్టారు. వినాయక చౌక్ ప్రాంతంలోని విన్నీ బేకరీ, గోకుల్ చాట్ టిఫిన్స్, వినాయక మెస్, సమృద్ధి టీ స్టాల్, కారం దోశ హోటల్, హాట్ చిప్స్ వంటి కేంద్రాల్లో సోదాలు నిర్వహించి, మొత్తం 8 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. వాణిజ్య అవసరాల కోసం తప్పనిసరిగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలని స్పష్టం చేశారు. ఇంటి అవసరాల కోసం ఇచ్చే సబ్సిడీ గ్యాస్‌ను వ్యాపారాలకు మళ్లించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

**వాణిజ్య అవసరాలకు ఇంటి**
**గ్యాస్ వాడితే చట్టపరమైన చర్యలు**
**వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్**
**బేకరీలు, హోటళ్లపై పోలీసుల మెరుపు దాడులు.**
**6 కమర్షియల్ సముదాయాలపై కేసులు**



**యాప్‌తో పారదర్శకంగా**

# ఇసుక సరఫరా

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

అక్రమాలు చోటు చేసుకోకుండా పారదర ?శకంగా ఇసుక సరఫరా చేసేలా మన ఇసుక వాహనం యాప్‌ను తీసుకొచ్చా మని కలెక్టర్ హరిత అన్నారు. కలెక్టరేట్ లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారిచే మన ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ వెబ్ పోర్టల్‌పై తహసీల్దార్, పంచా యతీ కార్యదర్శులు, గ్రామ పాలనాధికారులు, ఆపరేటర్లకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమా నికి అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, భూగర్భ గనుల శాఖ సంచాలకులు గంగాధర్‌రావులో కలిసి కలెక్టర్ హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా మాత్రమే అందించేం దుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా తహసీల్దార్, పంచా యతీ కార్యదర్శులు, గ్రామ పాలనాధికారులు మన ఇసుక వాహనం పోర్టల్‌లో పొందుపరిచిన విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇసుక రవాణాను ఆన్‌లైన్ ద్వారా పూర్తి పారదర్శకతతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణాపై లబ్ధిదారులకు మన ఇసుక వాహనం పోర్టల్‌పై వివరించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామ పంచయాతీలలో పారిశుధ్యం ప్రతి రోజు చేపట్టాలని వీధి లైట్లు పగటి పూట వెలుగుతున్నాయని వాటికి నియంత్రికలు అమర్చాలన్నారు. ఏప్రిల్ నెలలో నిర్వహిస్తున్న జనగణనలో భాగంగా ఏన్యూమరేటర్ల ఇళ్ల జాబితాను రూపొందిస్తున్నారని వారికి పంచాయతీ కార్యదర్శులు సహకరించాలన్నారు. భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా తహసీల్దార్‌లు దృష్టి సారించాలన్నారు. పీడీఎస్ బియ్యం మూడు నెలలవి ఒకే సారి పంపిణీ చేస్తున్నందున రద్దీ లేకుండా చూడాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలనాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాలో పర్యటించిన స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్**

# చైల్డ్ రైట్స్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్

**నిర్మల్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్ శనివారం జిల్లాలో పర్యటించారు. ముందుగా మామడ మండలంలోని జగదాంబ తండాలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, పిల్లలతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. పిల్లలకు సరైన సమయంలో పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం ఆమె, కొండాపూర్ లోని బాలసధనం (చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్)ను సందర్శించి, అక్కడ వసతి పొందుతున్న పిల్లలతో మాట్లాడారు. పిల్లలను సక్రమంగా చూసుకోవాలని, వారికి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, సీడబ్ల్యూసీ మెంబర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి మురళి, బాలసదనము సూపరిండెంట్ వైష్ణవి , సూపర్వైజర్ రజిని, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పక్కాగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ




**ఆసిఫాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
పక్కాగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కలెక్టర్ కె హరిత అన్నారు. హైదరాబాద్‌లోని ముఖ్య ఎలకో?ట్రల్ అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులతో శనివారం రాష్ట్ర ముఖ్య ఎలకో?ట్రల్ అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేయాలని, బూత్ స్థాయి అధికారుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని చెప్పారు. వారికి గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జాబితా తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను తెలియజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు ప్రక్రియ నిర్వహణలో సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ కె హరిత, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 678 పోలింగ్ ఉన్నాయని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బూత్ స్థాయి అధికారిని నియమించామని అన్నారు. బూత్ స్థాయి అధికారులకు, సూపర్‌వైజర్లకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు అందజేశామని చెప్పారు. బూత్‌స్థాయి ఏజెంట్ల జాబితా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి తీసుకుంటున్నామని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించామని తెలిపారు. ఫారం 6,7,8 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్ల ఆందోళన

**ఖానాపూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. శనివారం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సంధ్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వాగ్వాదాంతో సమావేశం గందరగోళంగా మారడంతో అధికారులు చైర్మన్ ఎన్నికను వాయిదా వేశారు. ఎన్నిక సందర్భంగా సమావేశంలో అధికారులు ఆల్ఫాబెటిక్ ఆర్డర్ ప్రకారం అంకం మౌనిక అనే బీజేపీ కౌన్సిలర్ పేరు పిలవగా, ఆమెకు మద్దతుగా ఏడుగురు కౌన్సిలర్లు చేతులెత్తారు. దీంతో మొదట కాంగ్రెస్ అభ్యర్థి చిన్నం సత్యం పేరు పిలవాలని పోడియం వద్ద ఉన్న అధికారుల మీదకి ఎమ్మెల్యే దూసుకెళ్లి, వారితో వాగ్వాదానికి దిగడంతో అధికారులు ఎన్నికను వాయిదా వేశారు. దీంతో సమావేశంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఆందోళనకు దిగి అధికారుల తీరును నిరసిస్తూ కార్యాలయంలోనే బైఠాయించి నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే, అధికారుల తీరు దారుణంగా ఉందని అన్నారు.మున్సిపల్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న 8 వార్డ్ కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి సొమ్మసిల్లి పడిపోయారు.

# మాజీ మంత్రి జోగు రామన్న ముందస్తు అరెస్ట్




**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జోగు రామన్నను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లోని మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. జోగు రామన్న మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హోం శాఖను తన ఆధీనంలో ఉంచుకొని ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేయించి జైలుకు పంపడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఖానాపూర్ నియోజకవర్గ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడంతో కుట్రా పూరిత చర్యలకు దిగజారడం శోచనీయమని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నియమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలు పోలీసుల పహారా మధ్య వారికి అనుగుణంగా మార్చుకునే కుతంత్రాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



## ప్రభుత్వం రైతులను వెంటనే ఆదుకోవాలి

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షానికి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మండల రైతులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారికి, జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురిసిన వడగండ్ల వాన వలన రైతుల మొక్కజొన్న, జొన్న పంట నష్టం వాటిల్లింది. దాని దృష్టిలో పెట్టుకొని రెండు రోజుల క్రితం మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సౌద్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందనీ, కానీ ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో శనివారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి కి వినతి పత్రం మండల వ్యవసాయ అధికారి ద్వారా మరోసారి విన్నవించడం జరిగిందనీ, రైతులు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామితో చరవాణిలో మాట్లాడుతూ మండల కేంద్రంలో చాలావరకు మొక్కజొన్న నష్టం జొన్న పంట నష్టం జరిగింది కానీ ఇప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రకటన చేయలేదు కావున రైతులు రేపటి వరకు ప్రభుత్వం నుండి ప్రకటన రాకుంటే ఈ నెల ఆరు తారీఖు నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో రైతులు అందరూ కలిసి నిరసన వ్యక్తం చేయడం జరుగుతుంది. కావున ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు పాల్గొన్నారు.



## తృటిలో తప్పిన ప్రమాదం

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి పాఠశాల ఎదురుగా ఉన్న ఎస్పీఎం పేపర్ మిల్లులో, గోడ లోపల పని జరుగుతున్న సమయంలో జెసిబి యంత్రం గోడకు తగలడంతో గోడ కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎస్పీఎం పేపర్ మిల్లులో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, యజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తోందని మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**రెబ్బెన, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
కొమరంభీం జిల్లా ఆసిఫాబాద్‌లోని రెబ్బెన మండలం కైర్గాం గ్రామంలో శనివారం అక్రమంగా నిల్వ చేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎర్ర మహేష్ గ్రామం ఖైర్గంపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## సింగరేణి కార్మికులకు శుభవార్త

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కార్మికులకు మరో శుభవార్త అందింది. యాజమాన్యం చొరవతో, సహజ మరణానికీ రూ.10 లక్షల ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయాలని యూనియన్ బ్యాంక్ నిర్ణయించింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఈ పథకం అమలు కానుంది. గతంలో 2024లో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సింగరేణి కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమాను యూనియన్ బ్యాంక్ ఉచితంగా అమలు చేసింది. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా, సహజ మరణానికి కూడా రూ.10 లక్షల బీమాను వర్తింపజేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ అధికారులు తెలిపారు.



# గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే



**కుభీర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
గ్రామాల్లో వేసవితో ప్రజలకు నీటి సమస్య వెంటాడుతుందన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని దోడర్నా గ్రామస్తులు ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌కు నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన నిధులతో శనివారం మండల నాయకులతో కలిసి నూతన బోరు వేయించి, ప్రారంభించారు. ఎమ్మెల్యే కృషితో గ్రామస్తులకు త్రాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటానని అన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాథోడ్, శంకర్, సాయినాథ్, ఇన్కమ్ టాక్స్ అధికారి రాథోడ్ ప్రకాష్, అజయ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



# విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి





- పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- మధ్యాహ్న భోజనం పరిశీలన!
- అధికారులకు రాజర్షి షా ఆదేశం
- దిగ్నూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలపై సమీక్ష
- వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని స్పష్టం కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దిగ్నూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజన నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న తాగునీటి సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ ట్యాంకులను నిరంతరం శుభ్రపరచాలని సూచించారు. పాఠశాల గదులు, మరుగుదొడ్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన ఆయన, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యనందించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, మౌనిక, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నూర్ సింగ్, సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ శ్రవణ్ కుమార్, ఈఈ చంద్రమోహన్, డీఈఈ రమణ, ఏఈఈ దివాకర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాతనపల్లి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు పటిష్ఠ బందోబస్తు



**ఎన్నిక కేంద్రాన్ని సందర్శించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా శనివారం క్యాతనపల్లి మున్సి పాలిటీ పరిధిలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కార్యాలయ పరిసరాల్లో అలాగే బయట కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఈ ఎన్నిక ప్రక్రియకు ఎలాంటి అడ్డంకులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, మున్సిపల్ కార్యాలయ ఆవరణలోకి కేవలం కొత్తగా ఎన్నికైన అభ్యర్థులు, అధికారులను మాత్రమే అనుమతించామన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## ఎల్ఓసీ పత్రాల పంపిణీ

**నిర్మల్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పట్టణాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లబ్ధిదారులకు నియోజకవర్గ ఇన్చార్జి శ్రీహరి రావు శనివారం ఎల్ఓసి పత్రాలను అందజేశారు. మొత్తం 119 మందికి రూ 44 లక్షల విలువచేసే పత్రాలు అందించడం జరిగిందన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి ఘనంగా నిర్వహణ

**వాంకిడి, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

అసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని కుల బంధువులు, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోటుపల్లి జైరాం, జిల్లా అధ్యక్షులు, పలువురు నాయకులు శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.

# మన ఇసుక వాహనం అప్లికేషన్ ప్రారంభం

**తహసీల్దార్ లాగిన్స్, హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

ప్రజలకు ఇసుక రవాణా సేవలను మరింత సులభతరం చేయడం మరియు పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన “మన ఇసుక వాహనం” వెబ్, మొబైల్ అప్లికేషన్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం అధికారికంగా ప్రారంభించారు. బోరజ్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ (ట్యూటా) హెల్ప్ డెస్క్‌ను సందర్శించి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లాగిన్ విధానం, సేవల వినియోగంపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, మైనింగ్ ఏడి రవీందర్, తహసీల్దార్ రాజేశ్వరి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో, ఆసుపత్రుల్లో అధిక ఖర్చుతో చికిత్స పొందిన 67 మంది బాధిత కుటుంబాలకు రూ.18.90 లక్షల విలువైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్ ప్రజలు చికిత్స కోసం యవత్మాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా రిమ్స్ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.



## జన్నారంలో ఘనంగా రన్ ఫర్ జీసస్

**జన్నారం, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలో రన్ ఫర్ జీసస్ పోగ్రాం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇంచార్జి పాస్టర్ శాలేము రాజు ఆధ్వర్యంలో జరిగింది'రన్ ఫర్ జీసస్ కార్యక్రమ ర్యాలీ ని యేసు కొరకు పరుగు అనే నినాదంతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క పునరుత్థానం అనే సందేశాన్ని ప్రకటిస్తుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండలంలోని సమస్త క్రైస్తవులు,పాస్టర్స్ అభిషేక్ ధమ్మా శామ్యూల్ క్రిస్టియన్ యూత్ లీడర్స్ మంద రాజేష్,పన్నేట్ పాల్, కొప్పుల రాము,ముగాల అజాయ్ కుమార్,తుడుం ప్రభాకర్, విశ్వాసులు పాల్గొన్నారు.






### ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**మంచిర్యాల, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ ల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 63 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, పోలింగ్ కేంద్రాల వారీగా కనీసం 50 శాతం మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సరిగా పనిచేయని బూత్ స్థాయి అధికారులను తొలగించడం జరిగిందని, వారి స్థానంలో కొత్త వారిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రీఫిల్లింగ్ దందా రట్టు

### నిందితుడి అరెస్ట్!

### వన్‌టౌన్ పోలీసుల మెరుపు తనిఖీలు

### 8 సిలిండర్లు, ఫిల్లింగ్ మిషన్ స్వాధీనం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల నుంచి రీఫిల్లింగ్ చేస్తూ అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి భారీగా సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఫెరోజ్ ఖాన్ (45) వృత్తిరీత్యా గ్యాస్ రిపేర్ పనులు చేస్తుంటాడు. అయితే, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో తెలిసిన వారి గ్యాస్ కనెక్షన్లను వాడుకుని తక్కువ ధరకు సిలిండర్లు సేకరించేవాడు. వాటి నుంచి చిన్న సిలిండర్లలోకి గ్యాస్ నింపి (రీఫిల్లింగ్), అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నిక్కచ్చిగా అందిన సమాచారం మేరకు పోలీసులు నిందితుడి నివాసంపై దాడి చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా 5 కేజీల కమర్షియల్ ఖాళీ సిలిండర్లు (3), 19 కేజీల భారత్ కమర్షియల్ సిలిండర్ (1), 14.2 కేజీల భారత్, ఇండియన్ డొమెస్టిక్ సిలిండర్లు (4) మొత్తం 8 సిలిండర్లను గుర్తించారు. వీటితో పాటు గ్యాస్ ఫిల్లింగ్ మిషన్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, మూడు గ్యాస్ పాస్ బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ వెల్లడించారు. జనవాసాల మధ్య ఇలాంటి ప్రమాదకర పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి




**తిర్యాణి, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. తిర్యాణి పోలీసు స్టేషన్‌ను శనివారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, సేష్టన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్‌హెచ్‌వో వెంకటేష్‌కు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని అన్నారు. మండల కేంద్రం, గ్రామాల్లో చోరీల నియంత్రణకు వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. శాంతి భద్రతల విషయంలో రాత్రి వేళ పర్యవేక్షణ, పెట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు.

# శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రాకు ఘన వీడ్కోలు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా శిక్షణ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సలోని చాబ్రా కు జిల్లా యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సలోని చాబ్రా తన శిక్షణ కాలంలో జిల్లాలోని వివిధ శాఖల పనితీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో పనిచేయడం తనకు మర్చిపోలేని అనుభవమని తెలిపారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, తోటి అధికారులు, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సలోని చాబ్రాను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. వివిధ శాఖల అధికారులు ఆమెతో తమ పని అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### క్యాతనపల్లి మున్సిపల్

# పాలకవర్గం ఎన్నిక

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

**మంచిర్యాల, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ల పరోక్ష ఎన్నికలు నిర్వహించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం పరీక్ష ఎన్నికకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గా గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్ గా మిట్టపెల్లి సరిత లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గజదొంగ మొయిజ్‌పై 'పీడీ యాక్ట్' నమోదు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలో వరుస చోరీలతో ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న గజదొంగ మొయిజ్‌పై పోలీసులు మరోసారి పీడీ యాక్ట్ ప్రయోగించారు. గత 15 ఏళ్లుగా నేర సామ్రాజ్యంలో కొనసాగుతూ, దాదాపు 70కి పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్న మొయిజ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అధికారులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మొయిజ్ వృత్తిరీత్యా దొంగతనాలను ఎంచుకుని ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాడు. గతంలో 2019లో కూడా ఇతనిపై పీడీ యాక్ట్ నమోదు కావడంతో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాడు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా బుద్ధి మార్చుకోకుండా మళ్లీ పాత పంథాలోనే చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతని ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు చేయగా, కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీడీ యాక్ట్ నమోదైన నేపథ్యంలో నిందితుడు మొయిజ్‌ను కట్టుదిట్టమైన భద్రత నడుమ హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ నేరాలకు పాల్పడి తప్పించుకోవచ్చని భావించే వారిపై చట్టం కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు ఏదైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



# క్యాతన్‌పల్లి 'గులాబీ'మయం

■ కూటమికే మునిసిపల్ పీఠం! ■ ఎట్టకేలకు ముగిసిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక
■ కాంగ్రెస్ సభ్యుల గైర్హాజరు ■ హైకోర్టు ఆదేశాలతో రెండూ నెలల ఉత్కంఠకు తెర..
■ 14 మంది సభ్యుల మద్దతుతో ఏకగ్రీవం ■ చైర్‌పర్సన్‌గా సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా సరిత ప్రమాణ స్వీకారం





**మంచిర్యాల, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

క్యాతన్‌పల్లి మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌ల పర్యవేణలో శనివారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో చేపట్టారు. దీంతో దాదాపు రెండునెలలుగా మునిసిపాలిటీలో నెలకొన్న ఉద్రిక్తతకు తెరపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 11న మునిసిపాలిటీల ఎన్నికలు జరగగా, 13వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. అన్ని మునిసిపాలిటీలకు 16న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు నిర్వహించగా, క్యాతన్‌పల్లిలో మాత్రం అనూహ్యంగా వాయిదా పడ్డాయి. ఆ రోజు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా బీఆర్‌ఎస్ సభ్యులు సమయానికి కార్యాలయానికి రాలేదన్న కారణంతో అధికారులు మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఫిబ్రవరి 17వ తేదీన రెండు పార్టీలకు చెందిన కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరైనప్పటికీ పీఠం కైవసం చేసుకోవడం కోసం ఇరు పార్టీలు పట్టుదలకు పోవడంతో కార్యాలయం లోపల నెలకొన్న ఉద్రిక్తతల నడుమ ఎన్నికలు నిర్వహించలేమని పేర్కొంటూ మళ్లీ వాయిదా వేశారు. ఎన్నికల్లో తమకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని పేర్కొంటూ బీఆర్‌ఎస్, సీపీఐ కూటమి సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మూడు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించడంతో దాదాపు రెండు నెలల అనంతరం ఎట్టకేలకు మార్గం సుగమం అయింది.

**అనేక మలుపుల నడుమ...**

క్యాతన్‌పల్లి మునిసిపాలిటీలో అనేక మలుపుల మధ్య ఎట్టకేలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ముగిసింది. చైర్మపర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని ఎన్నికలు ముగిసినప్పటి నుంచి బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు విశ్వ ప్రయత్నాలు చేశాయి. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 22 వార్డులు ఉండగా బీఆర్‌ఎస్‌కు 10 సీట్లు, మిత్రపక్షమైన సీపీఐకి నాలుగు స్థానాలు లభించాయి. అలాగే కాంగ్రెస్‌కు ఏడు సీట్లు రాగా, స్వతంత్రుల్లో ఒకరు ఆ పార్టీకి మద్దతు తెలపడంతో అధికార పార్టీ సభ్యుల సంఖ్య ఎనిమిదికి చేరింది. బీఆర్‌ఎస్, సీపీఐ కూటమికి మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన మెజారిటీ ఉన్నప్పటికీ చైర్‌పర్సన్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో మంత్రి గడ్డం వివేకానంద పావులు కదిపారు. ఒక దశలో సీపీఐ నుంచి గెలుపొందిన నలుగురు సభ్యులను తమవైపు తిప్పుకోవడం కోసం విశ్వప్రయత్నాలు చేశారు. పరిస్థితిని అంచనా వేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఫలితాలు వెలువడిన రోజే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కూటమి సభ్యులను క్యాంపు కోసం ఖమ్మం జిల్లాకు తరలించారు. తిరిగి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికను పురస్కరించుకొని ఫిబ్రవరి 16న తన కూటమి సభ్యులను క్యాంపు నుంచి నేరుగా మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం పూర్తయినప్పటికీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది.

**రెండు నెలలు క్యాంపులోనే...**

చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య చెలరేగిన వివాదం, పరస్పర దాడులు, పోలీసుల లాఠీ చార్జీతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మంత్రి వివేకాంద కాన్వాయ్‌పై దాడి చేశారనే కారణంలో బాల్క సుమన్‌పై ఫిబ్రవరి 17న కేసు నమోదు చేసిన పోలీసులు మరుసటి రోజు ఆయన్ను ఆరెస్టు చేసి, మంచిర్యాల కోర్టులో హాజరు పరిచారు. దీంతో ఆయనకు మంచిర్యాల కోర్టు 14 రోజులు రిమాండ్ విధించగా, ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు. అయినప్పటికీ తమ సభ్యులను కాపాడుకునేందుకు బాల్క సుమన్ అలుపెరగని పోరాటం చేశారు. తాను జైలుకు వెళ్లిన రోజే కూటమి సభ్యులు 14 మందిని హైద్రాబాద్ క్యాంపునకు తరలించారు. దాదాపు 51 రోజుల అనంతరం శనివారం జరిగిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికకు నేరుగా క్యాంపు నుంచి కార్యాలయానికి ప్రత్యేక బస్సులో తరలించారు. దీంతో కూటమి సభ్యులు దాదాపు రెండు నెలల పాటు కుటుంబాలకు దూరం కావడమేగాకుండగా, పండుగ, పబ్బాలకు కూడా ఇంటి ముఖం చూడకుండా ఉండిపోయారు.

**ఎన్నికకు కాంగ్రెస్ సభ్యులు దూరం..**

హైకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించగా, కూటమి సభ్యులనే రెండు పదవులు వరించాయి. ఎన్నికకు కాంగ్రెస్ సభ్యులు దూరంగా ఉండగా, బీఆర్‌ఎస్, సీపీఐ కూటమి సభ్యులు 14 మంది హాజరయ్యారు. సరిపడా కోరం ఉండటంతో అధికారులు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల్లో 10 సీట్లు సాధించిన బీఆర్‌ఎస్ సభ్యురాలు గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా మిత్రపక్షమైన సీపీఐకి చెందిన మిట్టపల్లి సరితకు మిగతా సభ్యులు మద్దతు తెలపడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి, నియామక పత్రం అందజేశారు. అనంతరం ఇద్దరితో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించడంతో రెండు నెలల అనంతరం కథ సుఖాంతం అయింది. కాగా ఎన్నికల సరళిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ షా పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేయించారు.

# ప్రజాస్వామ్యం గెలిచింది : మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గెలిచిందనడానికి క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికలే నిదర్శనమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శనివారం రామకృష్ణాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, సీపీఐ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకున్నప్పటికీ మంత్రి వివేక్ అనేక ప్రలోభాలకు గురిచేసి, బీఆర్‌ఎస్ నాయకులపై, తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. చివరికి ప్రజాతీర్పు ముందు ఇవన్నీ పటాపంచలయ్యాయని అన్నారు. తెలంగాణ సాధన కోసం జైళ్లకు వెళ్లి న చరిత్ర బీఆర్‌ఎస్ నాయకులను, కార్యకర్తలకు ఉందన్నారు. అలాంటి తమపై అక్రమ కేసులుపెట్టి అరెస్టలకు పాల్పడితే తలొగ్గుతామని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికార దుర్వినియోగానికి పాల్పడడం ప్రజాపాలననేనా అని ప్రశ్నించారు. తాటాకు చప్పుళ్లకు బయపడే పార్టీ బీఆర్‌ఎస్ కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చి పేద ప్రజల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కూటమికి పూర్తిస్థాయి మెజార్టీ ఉన్నప్పటికీ క్యాతనపల్లి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడం కోసం మంత్రి వివేక్ పోలీసులను, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజావ్యతిరేక పాలన చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే రాష్ట్రం అధోగతికి చేరుకుందని ప్రజలంతా కేసీఆర్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ హైదరాబాద్, ఖమ్మంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లను టార్గెట్ చేస్తూ అక్రమ కట్టడాలంటూ కూల్చివేస్తున్నారన్నారు. సీఎం రేవంతరెడ్డికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ కార్యవర్గ సభ్యుడు కలవేణి శంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడిన ఏఐటీయుసీ, సీపీఐ నాయకులపై మంత్రి వివేక్ చౌకబారు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. సీపీఐ నమ్మిన సిద్ధాంతాల కోసమే పని చేస్తుందని తెలిపారు. చైర్‌పర్సన సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన సరితకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన మూల రాజిరెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఏఐటీయుసీ, సీపీఐ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కేబినెట్ లో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామికి పరాభవం ఎదురయింది తన నియోజకవర్గంలో ఉన్న మంచిర్యాల జిల్లా క్యాతన్ పల్లి పురపాలక సంఘం ఎన్నికల వ్యవహారంలో మంత్రి వివేక్ ఫెయిల్ అయ్యారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఈ ఎన్నికల వ్యవ హారంలో తన పట్టును నిలుపుకొని సత్తా చాటారు. ఈ మున్సిపాలిటీలో మెజారిటీ కౌన్సిలర్లు భారత్ రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులు గెలుపొందగా సిపిఐ నుంచి గెలిచిన నలుగురు కూడా ఆ పార్టీకి మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ సంఖ్యాబలం ఎనిమిది వద్దనే ఉండగా... ఎలాగైనా మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు మంత్రి వివేక్ తీవ్రంగా ప్రయత్నాలు చేశారు ఒక దశలో ఈ మున్సిపాలిటీ వ్యవహారం రాష్ట్ర స్థాయిలో మారు మోగింది. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జైలుకు వెళ్లే దాకా వ్యవహారం ముదిరింది. దీంతో చివరకు మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరుతుందని ప్రచారం జరిగింది.. కానీ చివరికి క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ గులాబీ ఖాతాలోకి వెళ్లింది.



### చెన్నూరు ప్రజాస్వామ్య పద్ధతిలో

## మున్సిపాలిటీ ఎన్నికలు

**చెన్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

చెన్నూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగాయని గనుల శాఖామంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నికల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చెన్నూరులో హింసను ప్రోత్సహిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. పాత సుమన్‌లా అదే రీతిలో వ్యవహరిస్తే చెన్నూరు ప్రజలు ఊరుకోరని, తగిన గుణపాఠం చెప్తారని విమర్శించారు.

### గురుకుల విద్యార్థిని

## ఆత్మహత్యాయత్నం

**చెన్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

గురుకుల పాఠశాలలో విద్యార్థిని సూసైడ్ ఘటన కలకలం రేపుతోంది. వివరాల్లోకెళ్తే.. మంచిర్యాల చెన్నూరు పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్‌లో డెటాల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం గమనించిన సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## బైకర్' నా కెరీర్ బెస్ట్ ఫిల్మ్!

"ఈ సమ్మర్‌కి బ్లాక్‌బస్టర్ ఇస్తానన్నా.. చెప్పినట్లే 'బైకర్'తో బంపర్ బ్లాక్‌బస్టర్ కొట్టా. ఇది కేవలం స్పోర్ట్స్ డ్రామానే కాదు. తండ్రి - కొడుకు అనుబంధాలతో ముడిపడిన మంచి కుటుంబ కథా చిత్రం" అన్నారు శర్వానంద్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని అభిలాష్ రెడ్డి తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. మాళవిక నాయర్ కథానాయిక. రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. "ఈ చిత్ర విషయంలో ఫస్ట్ ప్రభాస్‌కు థ్యాంక్స్ చెప్పుకోవాలి. మా ట్రైలర్ విడుదలవ్వగానే తొలి ట్వీట్ వేసింది ఆయనే. అలాగే సినిమా విడుదలకు ముందు బైక్‌తో చిన్న ప్రమోషన్ చేశారు. లవ్ యూ.. ప్రభాస్ అన్న. నా మనసులో మీరెప్పుడూ పైనే ఉంటారు. ఈ చిత్రంలో చాలా మంది హీరోలున్నారు. అందులో ఫస్ట్ నిర్మాత వంశీనే. నాకీ కథను పంపింది ఆయనే. యూవీలో నాకిది నాలుగో సినిమా.ఇంతకు ముందు మేము చేసిన 'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మహానుభావుడు' అన్నీ హిట్టే. ఇప్పుడీ 'బైకర్'తో బ్లాక్‌బస్టర్ కొట్టాం. మాకింత మంచి విజయాన్నిచ్చిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇక దీనికి రెండో హీరో దర్శకుడు అభిలాష్. ఆయన రాసిన కథ అందించిన స్ఫూర్తితోనే ఈ సినిమా కోసం కఠిన కసరత్తులు చేసి బరువు తగ్గా. ఒకవేళ తనిలాంటి కథ నాకు ఇవ్వకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా నన్ను నటుడిగా.. వ్యక్తిగా చాలా మార్చింది. మేము దేశం గర్వపడే సినిమా తీస్తానని విడుదలకు ముందు చెప్పా. ఇప్పుడు తీశాం.. చూపిస్తున్నాం. తెలుగు సినిమా గర్వంగా చెప్పుకునే చిత్రమిది. ఇది నా కెరీర్‌కు బెస్ట్ ఫిల్మ్‌గా నిలిచిపోతుంది. ఇక ఈ చిత్రానికి మూడో హీరో దిలీప్ సుబ్బరాయన్. దీంట్లోని యాక్షన్ ఇంత బాగా వచ్చిందంటే దానికి కారణం ఆయనే. అలాగే జిబ్రాన్ అద్భుతమైన సంగీతమందించారు. దీన్ని కచ్చితంగా పిల్లలతో కలిసి చూడండి. శర్వా మంచి సినిమా చేశాడని మెచ్చుకుంటారు" అన్నారు."ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది.. నాకింత పేరు తీసుకొచ్చిందంటే కారణం దర్శకుడు అభిలాష్. ఆయన దీన్ని అద్భుతంగా తీర్చిదిద్ది.. మన ముందుకు తీసుకొచ్చారు. యూవీ క్రియేషన్స్ ఎక్కడా రాజీ పడకుండా నిర్మించింది. ఈ చిత్ర విషయంలో శర్వా కూడా నాకెంతో సహకరించారు. సెట్లో నన్ను చాలా బాగా చూసుకున్నారు" అన్నారు నటుడు రాజశేఖర్. ఈ కార్యక్రమంలో అభిలాష్, సంపత్ నంది, మాళవిక నాయర్ తదితరులు పాల్గొన్నారు.




## సెట్స్‌పై నాని హవా!

ఆయా షేర్... అంటూ ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు నాని పాటని పాడుకుంటుంటే, ఆయన మాత్రం పోరాట ఘట్టాలతో బిజీ అయిపోయారు. గత కొన్ని రోజులుగా అలుపెరగకుండా పోరాట సన్నివేశాల్లో నటిస్తున్నారు. 'ది ప్యారడైజ్' సినిమాకి సంబంధించి నెలకుపైగా సాగనున్న సుదీర్ఘమైన షెడ్యూల్ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో నాని, ఇతర తారాగణంపై విరామానికి ముందు వచ్చే కీలకమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా కోసం నాని కండలు తిరిగిన దేహంతో సన్నద్ధమైన సంగతి తెలిసిందే. సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పక్కా మాస్ కథతో రూపొందుతున్న ఈ సినిమాలో జడల్ అనే ఊర మాస్ పాత్రని పోషిస్తున్నారు నాని. పీరియాడిక్ కథతో రూపొందుతున్న ఈ సినిమా కోసం ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టించింది చిత్రబృందం. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రమిది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.



## యానిమే అవార్డ్స్ లో రష్మిక జోరు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న అంతర్జాతీయ వేదికలపై మరోసారి భారత గౌరవాన్ని చాటారు. జపాన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ లో వరుసగా రెండోసారి ప్రెజెంటర్‌గా ఎంపిక కావడం ద్వారా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఇప్పటికే 2024లో ఈ అవార్డుల వేదికపై మెరిసిన రష్మిక... ఇప్పుడు మళ్లీ అదే వేదికపై కనిపించబోతున్నారు. దీంతో ఈ అవార్డ్స్ లో రెండుసార్లు ప్రెజెంటర్‌గా వ్యవహరించిన తొలి భారతీయ సినీ సెలబ్రిటీగా ఆమె చరిత్ర సృష్టించారు.ఈసారి క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 10వ ఎడిషన్ మే 23న టోక్యోలో అంగరంగ వైభవంగా జరగనుంది. యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్‌లలో ప్రతిభ కనబరిచిన కళాకారులను సత్కరించే ఈ వేడుక ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది. ఈ వేడుకలో హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులతో కలిసి రష్మిక విజేతలకు అవార్డులు అందజేయనున్నారు. ఆమె పాల్గొనడం వల్ల భారతీయ ప్రేక్షకుల్లో కూడా ఈ ఈవెంట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. పుష్ప సినిమాలో 'శ్రీవల్లి' పాత్ర ద్వారా రష్మిక మందన్నకు జపాన్‌లో విశేషమైన క్రేజ్ వచ్చింది. అక్కడి ప్రేక్షకులు ఆమె నటనకు ఫిదా అయ్యారు. సోషల్ మీడియాలో కూడా భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం రష్మిక వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'మైసా', 'రణబాలి' వంటి భారీ అంచనాలున్న చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఆమె కెరీర్ మరో లెవెల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రష్మిక మందన్న అంతర్జాతీయ వేదికలపై వరుస అవకాశాలు అందుకుంటూ గ్లోబల్ స్టార్‌గా ఎదుగుతున్నారు. భారతీయ నటీమణులకి ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు పెరుగుతున్నాయన్న దానికి ఆమె మరో ఉదాహరణగా నిలుస్తున్నారు.





# నాగోబాను దర్శించుకున్న శిక్షణ డిప్యూటీ కలెక్టర్ల బృందం

■ ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలి ■ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ఉట్నూర్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల గిరిజన గ్రామాలతో పాటు పల్లెల్లో అమాయక ప్రజలు ఉంటారని, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా విధులు నిర్వహించాలని శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ లకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. జిల్లాలో పర్యటిస్తున్న శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ల బృందం శనివారం ఉట్నూరు లోని కేబీ కాంప్లెక్స్ లో టీపీసీసీ అధ్యక్షున్నీ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయన శిక్షణ కలెక్టర్లకు సూచనలు చేస్తూ.... ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిస్వార్ధంగా పనిచేసి ప్రభుత్వానికి గుర్తింపు తీసుకురావలసిన బాధ్యత మీపై ఉందన్నారు. అనంతరం శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ల బృందం ఇప్పపు లడ్డూల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయం వారితో తెలుసుకున్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాగోబా దేవునికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ చరిత్రను ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు అడిగి తెలుసుకున్నారు. ఉట్నూర్ మండలంలోని మారుమూల ప్రాంతాలైన కామాయిపేట గ్రామంలో పర్యటించారు. కొలాం గిరిజనులతో మాట్లాడి త్రాగునీరు, విద్యుత్తు, వర్షాకాలంలో ఎదుర్కొనే రవాణా సౌకర్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి జన్ మన్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా గిరిజనులకు అందుతున్న లబ్ధి వివరాలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు, రోడ్లు సరిగ్గా లేకపోవడంతో వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు బృంద సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన విద్యార్థులను చక్కగా బాగా చదివించాలని, గిరిజన గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యం, విద్య, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్ల సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి రోడ్డు సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని గ్రామ పెద్దలకు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలు, పంచాయతీ భవనాలు, పాఠశాలలు పరిసరాల శుభ్రతను పరిశీలించారు. పి వి టి జి కొలం గిరిజనులలో ప్రాథమిక విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు.



# బీఆర్ఎస్ పాలనంతా అవినీతే : పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనంత అవినీతి మయంగా సాగిందని, కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం, బావా బామ్మర్దుల మధ్య పదవుల పోట్లాట, కూతురితో ఆస్తి తగాదా.. ఇలా కేసీఆర్ కుటుంబ పరి స్థితి నెలకొందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. శనివారం ఆదిలా బాద్, నిర్మల్‌లోడీసీసీ అధ్యక్షులతో ఆయన ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతూ.. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ నెల 6న బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించే సభలో రూ.600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ట్లు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని.. దీనికి తానే ఉదాహరణ అని చెప్పారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ కుటుం బ సభ్యులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. అటు కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం దేవుళ్ల వేరుతో రాజకీయం చేస్తోందే తప్ప పేద ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దే వా చేశారు. దేశం కోసం ఆస్తులను, ప్రాణాలను త్యాగం చేసిన గాంధీ కుటుంబానికి.. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న మోదీ, అమీతాలతో పోలికే లేదన్నారు. ఎస్.ఐ.ఆర్ సర్వే పేరుతో ముస్లింల ఓట్లను తొలగించేందుకు మోదీ సర్కార్ కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం కానున్నాయని అన్నారు. మోదీ ప్రభు త్వం రాముని పేరుతో ఓట్ల రాజకీయాలు చేస్తూ దేశ విభజనకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎన్నికల్లో బిజెపి మాయమాటలు నమ్మి ప్రజలు నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించాలని ఇప్పుడు ప్రజలే బాధపడుతున్నారని తెలిపారు. ఆ నలుగురు ఎమ్మెల్యేలకు ఇవే చివరి పదవులని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ ఎంపి సోయం బాపురావు, డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, నాయకులు కంది శ్రీనివాన్ రెడ్డి, ఆడె గజేందర్, గంద్రత్ సుజాత, మంచికట్ల ఆశమ్మ, సాజిద్ ఖాన్, బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాటు వివిధ మండలాల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



# బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

**భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించాలి**

**ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలే వాడాలి**

**భవిష్యత్తు రద్దీకి తగ్గట్టుగా విశాలమైన రోడ్లు**

**మంత్రి కొండా సురేఖ, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష**

**ముథోల్, ఏప్రిల్ 4 (ప్రభాత సమాచారం)**

బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.